
సాక్షి
బాపట్ల
శనివారం ¡ 21 ¡ సెప్టెంబర్ ¡ 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 28,807 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 33,640 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 7713 క్యూసెక్కులు వదలగా బ్యాంక్ కెనాల్‌కు 1861 క్యూసెక్కులు వదిలారు.



49,041 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 43,733 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 49,041 బస్తాలు అమ్మారు.

న్యూస్‌రీల్

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

● జిల్లా ఎస్పీ తుషార్ డూడీ



బాపట్ల: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తుషార్ డూడీ హెచ్చరించారు. జిల్లాలో గురువారం రాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి బహిరంగ ప్రదేశాల్లో 81 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపరిచి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లాలో ఎక్కడైనా ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. దాబాలు, ఫ్యామిలీ రెస్టారెంట్లు, హోటళ్లు, ఇతర అనుమతి లేని ప్రదేశాలలో తాగితే చర్యలు తీవ్రంగా ఉంటాయని, నిర్వాహకులపై కూడా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో శాంతిభద్రతల్ని పరిరక్షించేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. రాత్రి గస్తీ, పెట్రోలింగ్ ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది వారి పరిధిలోని బహిరంగ ప్రదేశాలపై నిఘా ఉంచాలని ఎస్పీ సూచించారు. విజిబుల్ పోలింగ్, పల్లె నిద్ర నిర్వహించే సమయాలలో ప్రజలతో మమేకమై వారి పరిధిలో జరిగే అసాంఘిక కార్యకలాపాల గురించి సమాచారం తెలుసుకోవాలని తెలిపారు. దీనివల్ల ముందస్తుగానే వాటిని కట్టడి చేయవచ్చని పేర్కొన్నారు. ప్రజలు కూడా డయల్ 100, 112 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.

జాబ్‌మేళాలో 25 మంది ఎంపిక

రేపల్లె రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. అపెక్స్ సొల్యూషన్స్, రిలయన్స్ ట్రెండ్స్, డిక్సన్ కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులను ఇంటర్వ్యూలు చేశారు. 93 మందికి గానూ 25 మంది వివిధ కంపెనీలకు ఎంపికైనట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎ.కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది సీహెచ్. రవికుమార్, బుల్లియ్య, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ జిల్లా అధికారి పి.హారిక, సీడాప్ సిబ్బంది రాంబాబు, అరుణ్‌బాబు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలను ఏమార్చేందుకే లడ్డూ కల్తీ నాటకం

● మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మేడికొండ సునీల్



చినగంజాం: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్ని అమలు చేయకుండా ప్రజల్ని ఏమార్చడానికి టీటీడీ లడ్డూ కల్తీ నాటకం ఆడుతోందని మాల మహానాడు బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేడికొండ సునీల్ ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ అమలు, వరద బాధితుల సహాయం, వర్గీకరణ క్రీమీలేయర్, మెగా డీఎస్సీ, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500, యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, రైతుకు రూ.20 వేల పెట్టుబడి, వలంటీర్లకు రూ. 10 వేలు, భూహక్కు చట్టం రద్దు, బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్, రెండు సెంట్ల ఇంటి స్థలం హామీల అమలు ఏమైందని ప్రశ్నించారు. ప్రజలు ఎక్కడ ప్రశ్నిస్తారో అని వారి దృష్టి మరల్చడానికి చంద్రబాబు నాయడు కొత్త డ్రామాలకు తెరలేపారని విమర్శించారు. ప్రజలు వరదలతో అల్లాడిపోతుంటే వారికి సహాయం చేయడం మానేసి వారి మనోభావాల్ని దెబ్బతినేలా వ్యవహరిస్తున్నట్లు మండిపడ్డారు. తన పబ్బం గడుపుకోవడానికి ఆఖరికి కలియుగ దైవం ఆ వెంకటేశ్వరుడిని కూడా అడ్డం పెట్టుకుంటున్నాడంటే చంద్రబాబు నీచ సంస్కృతిని ప్రజలు అర్థం చేసుకోవాలని సునీల్ కోరారు. 100 రోజుల పాలనలో ప్రజలను వంచించి, మోసం చేసి ఇప్పుడు మంచి ప్రభుత్వం అని కార్యక్రమాలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. సూపర్ సిక్స్ అమలు చేయకపోతే ప్రజలు తిరగబడే రోజు ఎంతో దూరంలో లేదని సునీల్ తెలిపారు. ఇప్పటికైనా గత ప్రభుత్వంపై విమర్శలు మాని, ప్రజలకు ఇచ్చిన హామీల్ని నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

నేడు వీఐటీ - ఏపీ 4వ స్నాతకోత్సవం

తాడికొండ: ఐనవోలు వీఐటీ– ఏపీ యూనివర్సిటీలో 4వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు యాజమాన్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, గౌరవ అతిథిగా హైదరాబాద్‌కు చెందిన బోష్ గ్లోబల్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ సెంటర్ హెడ్ అంజాద్ ఖాన్ పఠాన్ పాల్గొననున్నట్లు పేర్కొంది.



ఈపూరు వద్ద తొలగించిన అరటి మొక్కలను రోడ్డు పక్కన పడవేస్తున్న వ్యవసాయ కూలీ



తిప్పలకట్ట వద్ద పూర్తిగా పాడైపోయి ఎండిపోయిన తమలపాకు తోటను తొలగించకుండా వదిలిపెట్టిన రైతులు



జవ్వలపాలెం సబ్‌స్టేషన్ సమీపంలో ముంపునకు పాడైపోయి వరద నీటిలోనే ఉన్న అరటి తోట



కొల్లూరు-ఈపూరు పొలిమేర దొంకలో డ్రిప్ ఇరిగేషన్ పైపులను ఏరే పనిలో వ్యవసాయ కూలీలు

పంట వ్యర్థాలతో అనర్థం

● కర్షకుల కష్టాన్ని కబళించిన కృష్ణా వరదలు
● పంట నష్టంతో పెట్టుబడులు నీటిపాలు
● భారంగా మారిన పంట వ్యర్థాల తొలగింపు
● పొలాల్ని బాగు చేసుకోవడానికి శ్రమిస్తున్న రైతులు

కొల్లూరు : కృష్ణా పరీవాహక గ్రామాలపై వరదలు విరుచుకుపడి సృష్టించిన విపత్తుతో రైతాంగానికి కోలుకోలేని నష్టం వాటిల్లింది. కృష్ణమ్మ ప్రకోపంతో కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని 26 గ్రామాల్లో 11 వేల ఎకరాలకు పైబడి పసుపు, కంద, అరటి, తమలపాకు, బొప్పాయి, కూరగాయలు, జామ వంటి వాణిజ్య పంటలు ముంపు బారిన పడి పనికిరాకుండా పోయాయి. మొత్తం 8,468 మంది రైతులు, కౌలు రైతులకు అపార నష్టం వాటిల్లింది. పెట్టుబడులు వరద నీటిపాలై ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

వ్యర్థాల తొలగింపునకు అదనపు ఖర్చు

వరద ముంపు కారణంగా నష్టపోయిన పంటల వ్యర్థాల్ని భూముల నుంచి తొలగించుకోవడం రైతులకు శక్తికి మించిన భారంగా మారింది.ఇప్పటికే ఎకరాకు రూ. 2 లక్షల వరకు నష్టం వాటిల్లింది. అప్పోసొప్పో చేసి రెండో పంట మినుము సాగు చేసుకోవడానికి వ్యర్థాలు అడ్డంకిగా మారాయి. కంద, పసుపు పంటలు సాగు చేసిన రైతులు అదనంగా ఎకరానికి రూ. 5 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. అరటి తోటలో వ్యర్థాల తొలగింపునకు రూ. 10 వేలు, తమలపాకు తోటల్లో రూ. 25 వేల వరకు పంట వ్యర్థాల తొలగింపునకే వెచ్చించాల్సి రావడం నష్టపోయిన రైతులకు గోరుచుట్టుపై రోకలిపోటులా తయారైంది. అహర్నిశలు శ్రమించి పంటలు సాగు చేస్తే వరద రూపంలో విపరీతం ఎదురైంది. వరద నష్టం దెబ్బతో సతమతం అవుతున్న తరుణంలో పంట వ్యర్థాల తొలగింపు భారంతో ఆర్థికంగా మరింత సతమతమవుతున్నారు.



కొల్లూరు మండలం కృష్ణనగర్ వద్ద కంద పంట వ్యర్థాలను తొలగించే పనిలో వ్యవసాయ కూలీలు

పైపులు సరిచేయడానికి భారీ ఖర్చు



వరదల వల్ల పంటలకు నీరు అందించడానికి ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ పైపులు నీటి వాలున కొట్టుకుపోయాయి. వాటిని తిరిగి ఏరించి పొలంలో అమర్చుకోవడానికే ఎకరాకు రూ. 4 వేలు పైబడి అవుతుంది. కొత్తవి కొనుగోలు చేయాలంటే ఆర్థిక భారం పెరుగుతున్న కారణంగా ఉన్న పైపులనే అమర్చుకుంటున్నాం.

–రావి శ్రీహరి, ఈపూరు, కొల్లూరు మండలం.

తలకు మించిన భారం



వరదల్లో నష్టపోయిన పంట వ్యర్థాల తొలగింపు ప్రక్రియ తలకు మించిన భారంగా మారింది. 17.50 ఎకరాలలో తమలపాకు, కంద, పసుపు, అరటి పంటలు సాగు చేస్తున్నా. ఇప్పటికే పంటలకు పెట్టుబడుల రూపంలో రూ. 20 లక్షలకు పైబడి వెచ్చించా. వరదల కారణంగా పంటలన్నీ తుడుచుపెట్టుకుపోవడంతో వ్యర్థాలు తొలగించుకోవడం తలనొప్పిగా మారింది.

–దివి వెకంటేశ్వరరావు, తిప్పలకట్ట, కొల్లూరు మండలం.

రెక్కలు ముక్కలు



వరదల కారణంగా పంటలు మునిగి కోలుకోలేని నష్టానికి గురయ్యాం. ఎకరాకు రూ. 70 వేల వరకు ఖర్చు చేసి సాగు చేసిన అరటి ఎందుకూ పనికిరాకుండా పోయింది. వరద ముంపునకు గురై ఎండిపోయిన అరటి వ్యర్థాలను తొలగించాలంటే రెక్కలు ముక్కలు చేసుకోక తప్పడంలేదు. ఎకరాకు రూ. 10 వేల వరకు ఖర్చు చేస్తే గాని తిరిగి రెండో పంటకు పనికొచ్చే అవకాశం లేదు.

–ఈపూరు కృపానందం, ఈపూరు, కొల్లూరు మండలం.

ప్రభుత్వమే ఆదుకోవాలి



వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్న మాకు కృష్ణా వరదలు తీరని నష్టాలను మిగిల్చాయి. కౌలుకు అరటి, పసుపు పంటలు సాగు చేస్తున్నా. మూడు ఎకరాలలో కంద మొక్కలు నాటి కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నాం. వరదల వల్ల ఏర్పడిన పంట నష్టానికి తోడు అరటి వ్యర్థాలను తొలగించుకోవడం శక్తికి మించిన వ్యవహారంలా మారింది. ప్రభుత్వం రైతులపై కరుణ చూపి పరిహారం పెంచి అందించి ఆదుకోవాలి.

–బొర్రా జితేందర్, జువ్వలపాలెం. కొల్లూరు మండలం

బడి పిల్లల మధ్యాహ్న భోజనంలో పిండి పదార్థాలు, ప్రొటీన్లు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: బడి పిల్లలకు పిండి పదార్థాలు, ప్రొటీన్లు, ఫైబర్, మినరల్స్‌తో మంచి భోజనం పెట్టాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులతో శుక్రవారం ఆయన వర్చువల్ సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు బడిలోనే భోజనం చేసేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, మెనూ పక్కాగా అమలు చేయాలని ఆయన తెలిపారు. భోజనం తయారీలో నాణ్యత పాటించాలని చెప్పారు. మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాలల్ని అధికారులు సందర్శించి పరిసరాల పరిశుభ్రతను పరిశీలించాలని ఆయన ఆదేశించారు. మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందుతుందా.. లేదా ? చూడాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై ప్రధానోపాధ్యాయులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు అభిప్రాయాలను తెలియజేయాలని ఆయన కోరారు. మండలాల నుంచి వచ్చే సూచనల మేరకు మార్పులు చేయడానికి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణ, విద్యాశాఖ ఏఎస్‌ఓ సంజయ్ కుమార్, ఎంఈవోలు పాల్గొన్నారు.



తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం బాపట్ల జిల్లా నేతలు మేరుగ నాగార్జున, వరికూటి అశోక్‌బాబు, పానెం చిన హనిమిరెడ్డి, ఈపూరు గణేష్, కరణం వెంకటేష్‌తో సమావేశమైన వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి

బండలాగుడు పోటీల్లో అపశ్రుతి

● బెదిరి జనంపైకి దూసుకొచ్చిన గిత్తలు
● ఐదుగురికి గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

ప్రత్తిపాడు: ఎడ్ల బండలాగుడు పోటీలు చూడటానికి వచ్చిన వారిలో అనుకోని రీతిలో గిత్తలు బెదరడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో జరుగుతున్న నందమూరి తారక రామారావు మెమోరియల్, నూతలపాటి పరమేశ్వర రావు మెమోరియల్ ఎడ్ల బండలాగుడు పోటీల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. బరిలో ఉన్న గిత్తలు బెదిరి జనం మీదకు దూసుకురావడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోటీల్లో భాగంగా శుక్రవారం బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన ఎ.శిరీష చౌదరి ఎడ్లు బెదిరిపోయి జనం మీదకు దూకాయి. సత్తెనపల్లి మండలం గుడిపూడికి చెందిన ఎన్.వీరయ్య, పొన్నూరు మండలం గోళ్లమూడిపాడుకు చెందిన కటారి వెంకటేశ్వరరావు, పర్చూరు మండలం పోలూరుకు చెందిన నెలకుదురు వెంకట్రావు, ప్రత్తిపాడు మండలం మేడావారిపాలెం గ్రామానికి చెందిన టి.కోటేశ్వరరావులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో గాయపడిన మరో వ్యక్తికి సంబంధించిన వివరాలు తెలియలేదు. రక్తపు వాంతులు చేసుకున్న వీరయ్యను 108లో గుంటూరుకు తరలించారు. మిగిలిన ముగ్గురిని మరో 108 వాహనంలో ప్రత్తిపాడు సీహెచ్‌సీకి తరలించి, అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. వెంకటేశ్వరరావుకు కళ్లకు సమీపంలో, తలపై రక్తగాయాలయ్యాయి. వెంకట్రావుకు మోకాలి కింద తీవ్ర గాయమైంది.



గాయపడిన వ్యక్తిని 108లో గుంటూరుకు తరలిస్తున్న సిబ్బంది



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కోటేశ్వరరావు

ఉచిత ఇసుకపై ఆంక్షలెందుకు ?

● కొల్లూరు ఎస్‌ఐను నిలదీసిన ఎడ్ల బళ్ల యజమానులు
● అక్రమ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను నిలువరించకపోవడంపై ఆగ్రహం
● ఎడ్ల బళ్లతో కొల్లూరులో రాస్తారోకోకు పయనం
● టీడీపీ నాయకుల జోక్యంతో ధర్నా విరమణ



పెసర్లంక నుంచి కొల్లూరులో రాస్తారోకోకు పయనమైన ఎడ్ల బళ్లు



ఎస్‌ఐను అరవింద వారధిపై నిలదీస్తున్న బళ్ల యజమానులు

కొల్లూరు : నదులు, వాగులు, వంకల నుంచి ఇసుక తరలించుకొని జీవనోపాధి పొందడంపై గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎటువంటి ఆంక్షలు లేవు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక విధానం అమలు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు ఆంక్షలు ఎందుకు పెడుతున్నారు? అంటూ ఎడ్ల బళ్ల యజమానులు కొల్లూరు ఎస్‌ఐ జి. ఏడుకొండలను నిలదీశారు. కృష్ణా నదికి వరదలొచ్చి బతుకులే భారమయ్యాయని, జీవనాధారంగా ఉన్న ఇసుక తరలింపుపై ఆంక్షలు విధించడం సబబు కాదంటూ ఆవేదన వెళ్లగక్కారు. మండలంలోని పెసర్లంక అరవింద వారధి వద్ద శుక్రవారం కృష్ణా నది నుంచి ఇసుక తవ్వకాలు చేపట్టి బళ్ల ద్వారా నిర్మాణదారులకు తరలించేందుకు బళ్ల యజమానులు వెళ్లారు. అయితే, నిబంధనలు వర్తించవని పోలీసులు అడ్డుకున్నారు. తమ కడుపుపై కొట్టడం తగదంటూ అరవింద వారధిపై బళ్లను నిలిపి ఆందోళనకు దిగుతుండటంతో ఎస్‌ఐ అక్కడకు చేరుకున్నారు. ఇసుక తరలింపుకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించేది లేదని కరాఖండిగా చెప్పడంతో బళ్ల యజమానులు పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమంగా తరలించుకొని వెళుతుంటే వాటి విషయంలో నోరు మెదపకుండా తమను ఎలా అడ్డుకుంటారని ప్రశ్నల వర్షం కురిపించారు. స్థానిక ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని ఎస్‌ఐ సూచించారు. నాయకుల దగ్గరకు వెళ్లినా తమను పట్టించుకున్న నాథుడు లేడంటూ కొల్లూరు బస్టాండ్ సెంటర్లో రాస్తారోకోకు సిద్ధమై వెళ్లారు. అయితే, ఫోన్‌లో ఉన్నతాధికారులతోపాటు, ఎమ్మెల్యేకు పరిస్థితి వివరించిన ఎస్‌ఐ వారి సూచనల మేరకు పెసర్లంక రామన్నపేట సమీపంలో నిలువరించారు. ఒక్కరోజు అవకాశం ఇస్తే ఎమ్మెల్యే, పోలీసు ఉన్నతాధికారులతో చర్చించి సానుకూలంగా సమస్యను పరిష్కరిస్తారని వెల్లడించారు. సంతృప్తి చెందని బళ్ల యజమానులు కొల్లూరు లాక్ సెంటర్‌కు చేరుకొనే సమయానికి టీడీపీ మండలాధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ అక్కడకు చేరుకున్నారు. ఎడ్ల బళ్లతో ఇసుక తరలించుకునే విషయంలో ఎవ్వరూ అడ్డుకోరని, వెనుతిరిగి వెళ్లి తవ్వకాలు చేపట్టుకోవచ్చని సూచించడంతో రాస్తారోకో విరమించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ఎజెండా

మంత్రి గొట్టిపాటి

సంతమాగులూరు (అద్దంకి): ప్రజా సమస్యల్ని పరిష్కరించడమే ఎజెండాగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆయన సంతమాగులూరు మండలంలోని మిన్నెకల్లు లో శుక్రవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను అధికారంలోకిరాగానే రద్దు చేశామని చెప్పారు. పేదలకు తక్కువ ధరకే భోజనం, పింఛన్లు పెంచడం, యుద్ధప్రాతిపదికన వరద బాధితులకు సహాయ సహకారాలు అందించామని వివరించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి, చీరాల ఆర్డీవో సత్యనారాయణరెడ్డి, ఎంపీడీవో లక్ష్మీదేవి, మండల ప్రత్యేకాధికారి రమేశ్‌బాబు, ఎంపీపీ యల్లమంద, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరి

రేపల్లె రూరల్: విపత్తులు సంభవించి పంటకు నష్టం వాటిల్లిన సమయంలో ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకున్న రైతుల్ని ప్రభుత్వం ఆదుకునేందుకు అవకాశం ఉంటుందని ఇన్‌చార్జి ఏడీఏ ఆర్.విజయ్‌బాబు తెలిపారు. ఈ-క్రాప్ నమోదుపై పట్టణంలోని రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. పలువురి పంట వివరాలను ఈ-క్రాప్ చేయించారు. ఈ సందర్భంగా విజయ్‌బాబు మాట్లాడుతూ రైతులు కూడా తమ వద్దకు వచ్చిన వ్యవసాయ అధికారులకు సాగు చేస్తున్న పంట వివరాల్ని అందించి సహకరించాలని కోరారు. ఈ నెల 23వ తేదీ వరకు ఈక్రాప్ బుకింగ్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. వ్యవసాయ అధికారులు కూడా రైతుల్ని చైతన్యపరచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఈవో పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జి ఏడీఏ విజయ్‌బాబు

క్లుప్తంగా

మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కొని పరారీ

చుండూరు(వేమూరు): మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కొని ఇద్దరు వ్యక్తులు పరారైన ఘటన నడిగడ్డపాలెం అడ్డరోడ్డు వద్ద జరిగింది. పోలీసు కథనం మేరకు.. చుండూరు మండలంలోని నడిగడ్డవారిపాలెం గ్రామానికి చెందిన జె. అరుణకుమారికి తెనాలిలో ఎలక్ట్రికల్ షాపు ఉంది. ప్రతి రోజూ ద్విచక్ర వాహనంపై తెనాలి వస్తారు. గురువారం సాయంత్రం తెనాలి నుంచి వస్తూ నడిగడ్డవారిపాలెం అడ్డ రోడ్డు వద్ద బైక్ ఆపి ఫోన్ మాట్లాడుతున్నారు. ఈ సమయంలో వెనుక నుంచి గుర్తు తెలియని వ్యక్తులు అరుణకుమారి మెడలో నాలుగు సవర్ల బంగారం నాంతాడు లాక్కొని పరారయ్యారు. ఈ మేరకు ఆమె శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె. సురేష్ తెలిపారు.

జీఓ 85ను రద్దు చేయాలి



బాపట్ల: ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 85ని రద్దు చేయాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు శుక్రవారం నిరసన చేపట్టారు. ప్రభుత్వం, ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ (పీహెచ్‌సీ) వైద్యుల మధ్య బుధవారం జరిగిన చర్చలు అసంపూర్తిగా ముగియడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనలో డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ కిరణ్, డాక్టర్ జాన్ ప్రసాద్, డాక్టర్ షైలాబాను, డాక్టర్ అనీష్ పాల్గొన్నారు.

ప్రజలకు పోస్టల్ శాఖ మెరుగైన సేవలు

నరసరావుపేట టౌన్: పోస్టల్ శాఖను ప్రజలకు మరింత చేరువ చేసే దానిలో భాగంగా భారత ప్రభుత్వ కమ్యూనికేషన్ల మంత్రిత్వశాఖ, పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా మూడు కార్యక్రమాలను రూపొందించినట్టు సూపరింటెండెంట్ పి.వెంకటస్వామి తెలిపారు. పోస్టల్‌శాఖ డాక్ నిర్యాత్ కేంద్ర, డాక్ చౌపాల్, డిజి-పిన్ పేరుతో ఆవిష్కరించిన మూడు కార్యక్రమాల ద్వారా గ్రామీణస్థాయి నుంచి ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఎగుమతులను ప్రోత్సహించేందుకు డాక్ నిర్యాత్ కేంద్ర ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీని ద్వారా గ్రామీణ ప్రాంతాలలో చేతివృత్తులు, చిన్న, కుటీర పరిశ్రమల ద్వారా తయారయ్యే వస్తువులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సులభంగా ఎగుమతి చేయవచ్చని చెప్పారు. డాక్ చౌపాల్ ద్వారా గ్రామాలలోని ఇళ్ల వద్దకే పోస్టల్ సేవలను అందిస్తామన్నారు. దీని ద్వారా డిజిటల్ విభజనను తగ్గించడం, ప్రజలకు అవసరమైన సేవలను అందించడం, ఆర్థిక చేరికలను ప్రోత్సహించనున్నట్టు తెలిపారు. డిజి-పిన్ ద్వారా పిన్‌కోడ్ సిస్టమ్, పోస్టల్ అడ్రస్, నావిగేషన్‌ను మెరుగుపరుస్తామని వివరించారు.

జ్వరం వస్తే వెంటనే రక్త పరీక్షలు చేయించుకోండి

ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించిన పల్నాడు జిల్లా వైద్యాధికారి

రాజుపాలెం: జ్వరం వచ్చి రెండు, మూడురోజులైనా తగ్గకుంటే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.రవి తెలిపారు. మండలంలోని చౌటపాపాయపాలెం, కొత్తబోధనం గ్రామాలలో ఫ్రై డే-డ్రై డే కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటా జ్వరాల సర్వే జాగ్రత్తగా చేయడం వల్ల సీజనల్‌గా వ్యాధులైన డయేరియా, డెంగీ, మలేరియా రాకుండా కాపాడుకోవచ్చునని సిబ్బందికి సూచించారు. సీజనల్‌గా వచ్చే వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు. ఇళ్లల్లో పాత టైర్లు, కొబ్బరి బొండాలను తొలగించాలని, కూలర్స్‌లో నీటిని వారానికొకసారి మార్చుకోవాలని సూచించారు. దోమలను పారదోలడం వల్ల డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, మెదడువాపు, బోద వ్యాధి వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ఇంటి పరిసరాలలోని సైడు కాలువల్లో వారానికొకసారి కిరోసిన్, బ్లీచింగ్ చల్లుకోవాలని సూచించారు . వర్షాకాలంలో అతిసార వ్యాధి ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయానికి దారితీస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా డెప్యూటీ డీఎంహెచ్‌ఓ హనుమకుమార్, జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్, సబ్ యూనిట్ అధికారి చంద్రశేఖర్, ఆరోగ్య పర్యవేక్షకులు జీవన్‌రావు, ఉషారాణి, కమ్యూనిటీ హెల్త్ అధికారి హన్నాకుమారి, ఏఎన్ఎం ప్రమీలాబాయి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


చౌటపాపాయపాలెంలో కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

రేపు కత్తి పద్మారావుకు పురస్కారం ప్రదానం

తెనాలి అర్బన్: ప్రముఖ కవి, ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ వ్యవస్థాపకులు డాక్టర్ కత్తి పద్మారావుకు ఖమ్మానికి చెందిన జాషువా సాహిత్య వేదిక ఆధ్వర్యంలో 'మన కాలపు జాషువా' పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవా ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్ శుక్రవారం సాయంత్రం తెనాలిలోని సేవా ట్రస్ట్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఈ విషయం వెల్లడించారు. ఈ నెల 22వ తేదీన పొన్నూరులోని లుంబినీవనంలో కార్యక్రమం ఉంటుందన్నారు. మహాకవి గుర్రం జాషువా జయంతి సందర్భంగా పురస్కారం ప్రదానం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అంబేడ్కర్ వాదులు, దళిత మహాసభ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. విలేకరుల సమావేశంలో అంబేడ్కర్ సేవా ట్రస్ట్ కార్యదర్శి దోబా సందీప్, ట్రెజరర్ పాముల దాసు, కనపర్తి ఎజ్రా, కొండ్రు రవీంద్ర, కనపర్తి చిట్టిబాబు, బ్రూస్లీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ అబ్రహాం లింకన్

రైల్వే సబ్ డివిజన్ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే సబ్ డివిజన్ డీఎస్పీగా వి.అక్కేశ్వరరావు శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఆయన నెల్లూరు, ఒంగోలు, గుంటూరులలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. పదోన్నతిపై డీఎస్పీగా ఇక్కడ పోస్టింగ్ పొందారు. ఈ సందర్భంగా గుంటూరు ఆర్‌పీఎస్, ఐఆర్‌పీ ఎస్‌హెచ్‌ఓ అంజిబాబు, ఎస్ఐ రమేష్, సుబ్బారావు, నడికుడి ఎస్ఐ శ్రీనివాసరావు నాయక్, గుంటూరు ఆర్‌పీఎఫ్ స్టాఫ్ తదితరులు ఆయనకు అభినందలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైల్వే ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా రక్షణ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రేపు జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జూనియర్ బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా కార్యదర్శి ఇ.శివ శంకర్ శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు ఆదివారం ఉదయం 8 గంటలకు స్థానిక ఎన్‌జీఓ క్లబ్‌లో ఉంటాయన్నారు. ఎంపిక చేసిన జట్లను వచ్చే నెల 5 నుంచి 7వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని చెప్పారు. వివరాలకు 93969 90666 ఫోను నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



గుంటూరు మెడికల్ : అందరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు (ఆర్డీ) డాక్టర్ సుచిత్ర అన్నారు. శుక్రవారం గుంటూరు ప్రాంతీయ శిక్షణ కేంద్రం, ఆర్డీ కార్యాలయాల్లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డాక్టర్ సుచిత్ర మాట్లాడుతూ.. వాతావరణ కాలుష్యం రోజురోజుకు పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా ప్రజల ఆరోగ్యానికి ఇబ్బంది ఏర్పడుతోందని పేర్కొన్నారు. దీన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో ప్రాంతీయ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ ఊర్మిళ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పద్మశ్రీ , ఆర్డీ కార్యాలయం సూపరింటెండెంట్‌లు షేక్ నాగూర్ షరీఫ్, గోపవరపు స్టాన్లీ రాజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు టిడ్కో ఇళ్లను వెంటనే అందించాలి

రేపల్లె రూరల్: టిడ్కో ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి పేదలకు అందించాలని పట్టణ ఆదర్శవేదిక కన్వీనర్ యడ్లపల్లి కిశోర్‌బాబు కోరారు. ఇళ్ల పంపిణీతో పాటు పట్టణంలోని సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మున్సిపల్ కమిషనర్ సాంబశివరావుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పలువురు పేదలు, కూలీలు సొంతిల్లు లేక అవస్థలు పడుతున్నారని, టిడ్కో ఇళ్లను వెంటనే నిర్మించి అర్హులైన వారికి అందించాలని కోరారు. పట్టణంలో కుళాయి కనెక్షన్లు శిథిలావస్థకు చేరాయని తెలిపారు. లీకులతో తాగునీరు కలుషితమయ్యే పరిస్థితులు ఉన్నాయని, వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు. జగనన్న కాలనీల్లో రహదారులు, డ్రైనేజీ, కుళాయి కనెక్షన్లతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వాడ మురుగు డ్రెయిన్, పెనుమూడి డ్రెయిన్‌కు సైడ్‌వాల్స్ నిర్మించాలని తెలిపారు. పట్టణంలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అదనపు చెరువులు తవ్వించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు కూనపురెడ్డి వెంకటేశ్వర్లు, నల్లూరి సాయి కృష్ణమాచార్యులు, బి.వి. మోహనరావు పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పట్టణ ఆదర్శ వేదిక సభ్యుడు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దుర్మార్గం

- పులివెందుల కళాశాల సీట్లను నిరాకరించడం ఏమిటి
- సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల రద్దు హామీ ఏమైంది
- సీఎం చంద్రబాబుకి ఎస్ఎఫ్ఐ లేఖ

నరసరావుపేట: ప్రభుత్వ వైద్య విద్య చదవాలనుకునే విద్యార్థుల ఆశలను కూటమి ప్రభుత్వం ఛిద్రం చేస్తోందని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా కన్వీనర్ కోట సాయికుమార్ విమర్శించారు. రాష్ట్రంలోని నూతన మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయాలని చూస్తున్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా శుక్రవారం రైల్వేస్టేషన్ రోడ్డులో ధర్నా నిర్వహించారు. సాయికుమార్ మాట్లాడుతూ విద్యను హక్కుగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు. తన బాధ్యతను మరిచి ప్రైవేటుకు వైద్య విద్య కట్టబెట్టడం దుర్మార్గమని అన్నారు. కేంద్రంతో సంప్రదించి ఐదు కళాశాలలకు అనుమతులు తీసుకురావాల్సిన ప్రభుత్వం పులివెందులకు వచ్చిన 50 సీట్లు కూడా వసతులు కల్పించలేమని ఏఎంసీకి లేఖ రాయడం ఏమిటని ప్రశ్నించారు. ఒక్క పాడేరుకే 50 సీట్లు వచ్చాయని, మిగిలిన నాలుగు కళాశాలలకు నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఓపీ ఇచ్చి ఉంటే అనుమతులు లభించి ఉండేవని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ చర్య వల్ల 700 సీట్లు కోల్పోయామని పేర్కొన్నారు. ఇది కేవలం వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయాలనే దుర్మార్గపు ఆలోచన నుంచి చేస్తున్న చర్యగా భావిస్తున్నామని తెలిపారు. అదే జరిగితే ఎంతో మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరమౌతారని అన్నారు. రిజర్వేషన్ల ఊసే ఉండదని తద్వారా వెనకబడిన తరగతుల విద్యార్థులకు నష్టం జరుగుతుందని అన్నారు. భవిష్యత్తులో ఉచిత వైద్యసేవలు పేద ప్రజలకు అందవని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో తీసుకువచ్చిన సెల్ఫ్ ఫైనాన్స్ పద్ధతిని తాము అధికారంలోకి వస్తే వందరోజుల్లో రద్దు చేస్తామని ప్రకటించారని, ఇచ్చిన హామీపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. అధికారంలోకి రాకముందు ఒక మాట, వచ్చాక వాటి ఊసెత్తకపోవడం కూటమి ప్రభుత్వపు వైఖరిగా ఉందన్నారు. వెంటనే వైద్య విద్య ప్రైవేటీకరణ ఆలోచనలను వెనక్కి తీసుకోవాలని, ఏఎంసీకి రాసిన లేఖ వెనక్కి తీసుకోవాలని, సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని రద్దుచేస్తామని ఇచ్చిన హామీని అమలు పరచాలని కోరారు. మెడికల్ కళాశాల భవనాల నిర్మాణాలను వెంటనే పూర్తిచేసి, ఉచిత వైద్య విద్యను పేద, మధ్యతరగతి ప్రజలకు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు లేఖ రాస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు షాదుల్లా, నాని, విద్యార్థులు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్ రోడ్డులో ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

నీట మునిగిన పంట పొలాల గుర్తింపు

అమరావతి: వరదలకు నీట మునిగిన పంట పొలాలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు మండల వ్యవసాయశాఖాధికారి అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుమారు వారం రోజులపాటు మండల పరిధిలోని వరద ముంపునకు గురైన గ్రామాలలో అగ్రికల్చర్ అసిస్టెంట్, వీఆర్‌వోలు పొలాలను పరిశీలించినట్లు తెలిపారు పారదర్శకంగా ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం నీట మునిగిన పొలాలను నమోదు చేశారన్నారు. మండలంలో 1709 మంది రైతులకు చెందిన 2929.72 ఎకరాలలో వివిధ పంటల నీట మునిగాయన్నారు. ఇందులో 46.98 ఎకరాలలో 29మంది రైతులకు చెందిన ఉద్యాన పంటలు నీటమునిగాయన్నారు. వివరాలతో నివేదికను ఉన్నతాధికారులకు అందజేసినట్లు తెలిపారు.

విజ్ఞాన్ ఆచార్యులకు ప్రతిష్టాత్మక గుర్తింపు

చేబ్రోలు: గుంటూరు జిల్లా వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన ఆరుగురు ఆచార్యులు వరల్డ్ టాప్ సైంటిస్ట్‌ల జాబితాలో చోటు సాధించారని వైస్ చాన్సలర్ పి. నాగభూషణ్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ నిర్వహించిన సర్వేలో తమ వర్సిటీకి చెందిన ప్రొఫెసర్ అంబటి రంగారావు, కె.చంద్రశేఖర్, ప్రొఫెసర్ కె.వెంకటరావు, డాక్టర్ రుద్రపాల్ మిథున్, డాక్టర్ జోత్స్నాదేవి బోడపాటి, ప్రొఫెసర్ టి.సుబ్బయ్యలు వరల్డ్ టాప్ 2% సైంటిస్ట్‌లలో నిలిచారని తెలిపారు. గత సంవత్సరం వరకు ఉత్తమ సైంటిస్ట్‌ల డేటాను తీసుకోవడంతోపాటు స్టాండర్డ్ సైన్స్ మేట్రిక్స్ క్లాసిఫికేషన్‌లో గల 44 సైంటిఫిక్ ఫీల్డ్స్, 174 సబ్ ఫీల్డ్స్‌ను పరిగణనలోనికి తీసుకుని ఈ ఫలితాలను వెల్లడించారని పేర్కొన్నారు. వీరికి చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య తదితరులు నగదు బహుమతులు అందించి, అభినందనలు తెలిపారు.


ఆచార్యులను అభినందిస్తున్న చైర్మన్ లావు రత్తయ్య

జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు క్రోసూరు విద్యార్థులు ఎంపిక

క్రోసూరు: క్రోసూరు సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థులు ఇరువురు జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్స్‌పాల్ మేరీ రజిత శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్ 15వ తేదీన అనంతపురం జిల్లా ఎస్‌కే యూనివర్సిటీ, క్యాంపస్ పాఠశాలలో సాఫ్ట్‌బాల్ పోటీల్లో సబ్ జూనియర్స్ బాలబాలికల జట్టు ఎంపిక చేశారు. పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు నుంచి క్రోసూరులోని సెయింట్ ఆన్స్ పాఠశాల బాలికలు బి.చందన, బి.తనూజ ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు నవంబర్ నెలలో జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలోని శ్రీనగర్‌లో జరిగే 37వ సబ్ జూనియర్ నేషనల్ సాఫ్ట్ బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని చెప్పారు. జాతీయస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పీఈటీ ఉపాధ్యాయుడు మక్కెన వెంకటరావు అభినందించారు.


బి.చందన, బి.తనూజ

మందు బాబుల ఆరోగ్యంతో సర్కారు చెలగాటం

ప్రత్తిపాడు: తక్కువ ధరకే నాణ్యమైన మద్యం అందిస్తామంటూ బీరాలు పలుకుతున్న కూటమి ప్రభుత్వం.. మద్యం నాణ్యత సంగతి అటుంచితే... కాలం చెల్లిన బీర్లు మద్యం ప్రియులకు అంటగడుతోంది. అందుకు సాక్ష్యమే ఈ ఘటన. ప్రత్తిపాడులోని ఒక ప్రభుత్వ మద్యం దుకాణంలో గురువారం రాత్రి కొందరు యువకులు బూమ్ బూమ్ బీర్లు ఒక్కొక్కటి రూ. 180 చొప్పున కొనుగోలు చేశారు. తాగడానికి సీల్ ఓపెన్ చేశారు. ఇంతలో బీర్‌బాటిల్‌పై ఉన్న తేదీలు ఎక్స్‌పైర్ అయ్యి ఉండటం చూసి అవాక్కయ్యారు. దుకాణం వద్దకు వెళ్లి కాలం చెల్లిన బీర్లు ఎలా విక్రయిస్తారంటూ ప్రశ్నించారు. తాజాగా వచ్చిన స్టాక్‌లోనే ఈ బీర్లు ఉండటం చూసి సిబ్బంది కూడా షాక్‌కు గురయ్యారు. దీంతో ఆ బీర్ సీసాల కేసును పక్కన పెట్టేశారు. దీనిపై ప్రత్తిపాడు ఎక్సైజ్ ఎస్ఐ మాధవిని ప్రశ్నించగా.. సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేశామని చెప్పారు.



శుభ్రతా కార్యక్రమాల్లో పొగాకు బోర్డు

కొరిటిపాడు: గుంటూరులోని పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయంలో 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. బోర్డు ఇన్‌చార్జి సెక్రటరీ డి. వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరగబోయే ఈ కార్యక్రమంలో భాగంగా రైతు భవన్‌లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. నోడల్ ఆఫీసర్ జి. దామోదర్, మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలి

- ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరిస్తా
- హామీ ఇచ్చిన డీఎంహెచ్‌వో డాక్టర్ రవి

నరసరావుపేట: తమపై రాజకీయ వేధింపులు ఆపి అనారోగ్యానికి గురైన తమకు సెలవులు ఇవ్వాలని ఆశా వర్కర్లు కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవికి ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆశాలతో ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహించి వారి సమస్యలు తెలుసుకోవాలనే హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో తన కార్యాలయంలో ఆశా కార్యకర్తలతో సమావేశమయ్యారు. సమస్యలపై వారి నుంచి 15 సమస్యలతో కూడిన అర్జీ స్వీకరించారు. తమకు సంబంధంలేని సూదులు, వ్యాక్సిన్ బాక్స్‌లు తీసుకురావటం వంటి పనులను అప్పగించి వాటిని చేయాలంటూ తీవ్రమైన ఒత్తిడికి గురిచేస్తున్నారని వాపోయారు. ప్రశ్నించిన వారిపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని, సబ్‌సెంటర్లు, సచివాలయాలు, హెల్త్ సెంటర్లలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4.30వరకు ఉండాలని వేధిస్తున్నారని తెలిపారు. ఓపీ సబ్‌స్క్రిప్షన్‌లు రాయించటం, పరిసరాలు శుభ్రం చేయించటం, కాన్పులకు ఏఎన్ఎంలు రాకుండా తమను మాత్రమే పంపించటం ఆపాలని కోరారు. 104 క్యాంపులలో ఇంజక్షన్లు, పరీక్షలు, మందులు ఇవ్వటం ఆపించాలని, సెల్‌ఫోన్లు ఇచ్చి చార్జింగ్ చేయించాలని విన్నవించారు. గర్భిణులు హాస్పిటల్‌లో చేరితే ఆమె అక్కడ ఉన్నంతకాలం తమను ఉండాలని ఒత్తిడి చేయటం ఆపాలని కోరారు. తన పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని, పరిధిలో లేనివాటిని పైఅధికారులకు పంపుతానని డీఎంహెచ్‌వో తెలియచేశారు. డీపీహెచ్ఎన్‌వో బి.సురేఖ, డీసీవో యన్.సురేష్, సీఐటీయు నాయకురాలు డి.శివకుమారి, ఆంజనేయనాయక్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


డీఎంహెచ్‌వో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు, ప్రతినిధులు

వినూత్న రీతిలో కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సుల ఆందోళన

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు శుక్రవారం మోకాళ్లపై నిలబడి వినూత్న రీతిలో ఆందోళన కొనసాగించారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని వాపోయారు. న్యాయం చేయాలని విధులు బహిష్కరించి 16వ రోజూ నల్లబ్యాడ్జీలతో ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. తమను రెగ్యులర్ చేసే వరకు కార్యక్రమం కొనసాగుతుందని వారు తెలిపారు. రెగ్యులర్ స్టాఫ్‌నర్సు ఉద్యోగాల నోటిఫికేషన్ 15 ఏళ్లుగా ప్రభుత్వం ఇవ్వకపోవడం వల్ల తాము తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర నాయకులు పి.మనీష, స్వచ్ఛంద ప్రసాద్, జిల్లా అధ్యక్షురాలు రేణుక, సెక్రటరీ శివమ్మ, కోశాధికారి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు కోటేశ్వరి, సౌజన్య, కరుణ, జాయింట్ సెక్రటరీలు హైమావతి, సంధ్య, మేరీ, రమాదేవి, సభ్యులు కుసుమ కుమారి, సుధారాణి, బాలసుందరి, అంజమ్మ, సురేష్, సర్దార్, సుభాని తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు

జాతీయ క్యారమ్స్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): గ్వాలియర్‌లో ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న 49వ జాతీయ జూనియర్ నేషనల్స్ పోటీలకు జిల్లాకు చెందిన బి.నవ్య, జి.మయూఖలు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆంధ్రా స్టేట్ క్యారమ్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో నవ్య బంగారు, మయూఖ రజత పతకాలు సాధించడంతో జాతీయ పోటీలకు ఎంపిక చేశామని చెప్పారు. క్రీడాకారులకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నీరజ్ కుమార్ స్కాంపతి, చీఫ్ ప్యాట్రన్ యాగంటి దుర్గారావు అభినందనలు తెలిపారని పేర్కొన్నారు.

